


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## రిటైర్మెంట్

**ఒళ్ళంతా** చెమటలు పట్టి మెలుకువ వచ్చేసింది శాంతికి. ఏసి ఆపేసి వుంది. 'కరెంట్ పోయిందేమో' అనుకుంది. కాని బయటనించి టి.వి పెద్దగా వినపడుతోంది. కిటికీలోంచి మందమైన కాంతి కనిపిస్తోంది. విసురుగా బయటకి వచ్చి అరిచింది.

"ఏసి ఎందుకు ఆపేసారు?"

"తెల్లారింది కదోయ్. ఎటూ లేస్తావుగా అని" కాఫీ తాగుతున్న నరహరి తాపీగా చెప్పాడు.

"తెల్లారిందా? టైం ఐదున్నర. మీకు నిద్రపట్టదని అంతా లేచి కూర్చోవాలా? ఎన్నిసార్లు చెప్పాను ఏసి ఆపద్దని? పోనీ ఆపేసినా ఫేన్ వేసి వెళ్ళచ్చుగా? నేను నిద్రపోవడం మీరు భరించలేరు. మీకు అసూయ. ఓసారి మెలుకువ వస్తే, మళ్ళీ పడుకోలేనని మీకు తెలుసు. ఐనా కూడా..." ఉక్రోషంతో శాంతికి కళ్ళనీళ్ళు వచ్చాయి.

గలగలా నవ్వాడు నరహరి.

"నీకు అశాంతి అని పెట్టాల్సింది పేరు. వెళ్ళి మొహం కడుక్కో. పాలు కాచేసా. కాఫీ కలుపుకో" చెప్పాడు.

"పెళ్ళికి ముందుదాకా శాంతినే. నా ఖర్మకాలి పెళ్ళయ్యాక అశాంతినయ్యా." బాత్‌రూంలోకి వెళ్ళి ధన్‌మని తలుపు వేసుకుంది శాంతి.

కాఫీ కలుపుకుని పేపర్ అందుకుంటూ టైం చూసింది. ఆరూ పది. ఆమెకి దుఃఖం వచ్చింది. ఇప్పుడు తెల్లారితే, ఎప్పటికి పొద్దుకూకాలి? ఈ మనిషితో ఎన్ని గంటలు గడపాలి? మధ్యాహ్నం నిద్రపోయే అలవాటున్నా బావుండేది రెండు మూడు గంటలు ఖర్చయ్యేవి. కానీ ప్రశాంతంగా నిద్రపోనిస్తాడా తన పిచ్చికాని.

"టిఫినేం చేస్తున్నావు శ్రీమతి?" పక్కన కూర్చుంటూ అడిగాడు నరహరి.

"ఇప్పుడేగా తెల్లారింది? కాఫీకూడా గొంతు దిగద్దా?" అరిచింది.

బద్ధకంగా తొమ్మిదిగంటలకి స్నానం చేసి వంటింట్లోకి వెళ్ళింది. వంట చేయాలనిపించలేదు. ఫ్రిజ్‌లో చూస్తే లెఫ్టోవర్స్ చాలానే ఉన్నాయి.

'అమ్మయ్య! అన్నం ఒక్కటి వండితే చాలు' ఆనందపడింది. బియ్యం నానపెట్టి వెళ్ళి టివి చూడసాగింది.. ఫోన్ మోగింది. నరహరితో పనిచేసిన కరుణాకరం.

"అమ్మా! హరి ఫోన్ తీయడంలేదు. మేం పన్నెండుగంటలకల్లా వస్తామని చెప్పు. మరీ హైరానపడి పథ్నాలుగు రకాలు చేయకండి. రెండు మూడు ఐటమ్స్ చేస్తే చాలు" ఫోన్ పెట్టేసాడు.

శాంతికి ఓ క్షణం ఏమీ అర్థం కాలేదు. అయ్యాక కోపంగా బెడ్‌రూంలోకి వెళ్ళి నిద్రపోతున్న నరహరిని కుదిపి లేపింది.

"ఇదేం దరిద్రపు అలవాటు? పొద్దున్న ఐదింటికి లేవడం, కాఫీ టిఫిన్లు తిని ఎనిమిదింటికి మళ్ళీ నిద్రపోవడం. కరుణాకరం ఏంటి పన్నెండుకి వస్తాం అంటున్నాడు? ఎందుకు?"

నరహరి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ చెప్పాడు. "నీకు చెప్పలేదా? ఇవాళ వాళ్ళని లంచ్‌కి పిలిచాను."

"లంచ్‌కా? మన పక్క బజార్‌లోనే ఉండేవాళ్ళని లంచ్‌కి పిలవడం ఏమిటి? ఆయన సరే అని రావడం ఏంటి? ముందు నన్ను అడగక్కర్లేదా? నాకు చెప్పక్కర్లేదా? పదవుతోంది. రెండు గంటల్లో నాకు వంటేం అవుతుంది? కూరగాయలు తెమ్మని నాలుగు రోజుల్నించి చెప్తున్నాను. వినరు. మీతో వేగడం ఎలా? నేనేం చేయను. మీ ఫ్రెండ్‌కి ఆయన పెళ్ళానికి ఏం వండిపెట్టుకుంటారో పెట్టుకోండి" శాంతి అరిచింది.

"ఛీఛీ! నీకు మనుషులు గిట్టడం లేదసలు" నరహరి గొణిగాడు.

"అవును. బ్రహ్మరాక్షసిని. మనుషుల్ని విరుచుకు తిందాం అనుకుంటాగాని వాళ్ళు గిట్టడం ఏమిటి?"

"ప్లీజ్. శాంతీ ఈ పూటకి ఏదో ఒకటి చేసెయ్. ఇకనించి నీకు చెప్పే పిలుస్తాను" నరహరి బతిమాలాడు.

శాంతి ఎర్రగా చూస్తూ వంటింట్లోకి నడిచింది.

లేటెస్ట్‌గా రిలీజైన సినిమా ఆ ఆదివారం సాయంత్రం టి.విలో వస్తుందని చూడగానే శాంతి తెగ సంబరపడిపోయింది. నరహరి సినిమా హాల్స్‌కి రాడు, వచ్చినా 'వాడు దగ్గాడు, వీడు తుమ్మాడు. ఏసి హాల్స్‌లో తలుపులు మూసుకు కూర్చుంటే రోగాలొస్తాయి. సినిమా ఏం బాలేదు. మూడుగంటల టైం వేస్ట్" నసుగుతూనే ఉంటాడు. అందుకని శాంతి అతన్ని అడగడం మానేసింది. ఎవరైనా ఫ్రెండ్స్‌తో వెళతానన్నా నసే, కాలేజ్ స్టూడెంట్ అనుకుంటున్నావా అని వెటకారాలు. దాంతో బయట థియేటర్స్‌లో సినిమా చూసి ఐదారేళ్ళు దాటింది. సినిమా పిచ్చిగల శాంతి వాటిని టి.విలో చూసుకుంటూ తృప్తిపడుతోంది.

శనివారం రాత్రి నరహరికి చెప్పింది. 'రేపు సాయంత్రం నాలుగున్నర నించి టి.వి నాదే నన్ను డిస్టర్బ్ చేయద్దు"

"నీలాంటి వాళ్ళ మూలంగానే ఇండియా ఇంత వెనకబడిపోయింది" నరహరి సినిమా పిచ్చిమీద ఓ గంట ఉపన్యాసం ఇచ్చాడు కాని శాంతి వినలేదు. నిద్రపోయింది.

"ఆదివారం సాయంత్రం నాలుగుకే రాత్రి వంటకూడా ముగించి, టి.వి ముందు కూర్చుంది శాంతి. నరహరి కూడా వచ్చి పక్కన కూర్చున్నాడు. అతనికి బయటకి సినిమా హాల్‌కి వెళ్ళి సినిమా చూడటం ఇష్టంలేదు కానీ టి.విలో వచ్చేవన్నీ పొల్లుపోకుండా చూస్తాడు. సీరియల్స్ చూస్తూ కామెంట్స్ చేస్తాడు. అరుదుగా వార్తలు చూస్తాడు.

సినిమా మొదలైంది మొదటి పావుగంట కథ నడిచాక, పావుగంట అడ్వర్‌టైజ్‌మెంట్స్ వచ్చాయి. విసుగ్గా ఉన్నా శాంతి ఓపికగా కూర్చుంది. 'కొత్త సినిమా కదా ఆ మాత్రం యాడ్స్ లేకపోతే ఎలా పాపం?' అని సమాధాన పరుచుకుంది.

యాడ్స్ అయిపోయి కథ స్టార్ట్ అవగానే నరహరి ఫోన్ మోగింది. శాంతి అతనివంక చురుక్కున చూసింది. నరహరి ఆమెవైపు చూడకుండా ఫోన్ స్పీకర్ ఆన్ చేసి మాట్లాడసాగాడు. శాంతి టి.వి సౌండ్ తగ్గించింది. నరహరి స్నేహితుడు. పిచ్చాపాటి మాట్లాడడానికి ఫోన్ చేసాడు.

శాంతి అతన్ని లోపలికి వెళ్ళమన్నట్లుగా సైగ చేసింది. నరహరి పట్టించుకోలేదు. ఆమె ఉక్రోషాన్ని అణచుకుంటూ, చెవులు రిక్కించుకుని టివి చూడసాగింది. మళ్ళీ యాడ్స్ మొదలయ్యాయి. నరహరి ఫోన్ సంభాషణ కూడా ముగిసింది."లోపలికి వెళ్ళి మాట్లాడచ్చుగా?" శాంతి అరిచింది.

"అంత ఇంపార్టెంట్ ఏమీకాదు" నరహరి చప్పరించాడు.

"అదికాదు. స్పీకర్ ఆన్ చేసి మాట్లాడతారేం? నేను సినిమా చూడాలి కదా?"

"ఫోన్ చెవుల్లో పెట్టుకుని మాట్లాడితే చెవులు పోతాయ్" చెప్పాడు. సినిమా మొదలైంది. రెండు నిమిషాలు చూసాక నరహరి ఓ నంబర్‌కి ఫోన్ చేసి మాట్లాడసాగాడు.

"రఘు నేనేరా. ఇప్పుడే మన ఫ్రెండ్ సుధాకర్ ఫోన్ చేసాడు.."

శాంతి మళ్ళీ టి.వి సౌండ్ తగ్గించింది. ఐదునిమిషాలైనా ఆ సంభాషణ ఆగకపోవడంతో పక్కగదిలోకి వెళ్ళమని సైగ చేసింది. అతను పట్టించుకోలేదు. మరో ఐదునిమిషాలు చూసి, లేచి బెడ్‌రూంలోకి వెళ్ళి పడుకుంది.

పావుగంట తర్వాత నరహరి వచ్చి అడిగాడు.

"కొత్త సినిమా అని నిన్నంతా తెగ ఎగిరావుగా. రా .. చూద్దాం."

"పర్లేదులెండి. మీ ఫ్రెండ్స్ అందరితో మాట్లాడుకోండి. మళ్ళీ కొత్త సినిమా ఎప్పుడొస్తుందో ఏమో" శాంతి వ్యంగ్యంగా చెప్పింది.

"నీకు మనుషులు పడరు. పొట్లకాయవి. పొడగిట్టదు" అనవసరంగా అరిచాడు.

"అవును" చెప్పి శాంతి అటు తిరిగి పడుకుంది.

"రేపు నేను మా అక్కా వాళ్ళింటికి వెళ్తున్నాను" ఆ రాత్రి చెప్పింది.

"సరే. ఎన్నింటికి బయలుదేరాలి?" నరహరి అడిగాడు.

"నేను వెళ్తుంటే మీరెందుకు తయారవడం?"

"అదేంటి? నేను రావడం లేదా?"

"లేదు. వస్తే నేను వెళ్ళను అసలు."

"సరే. రానులే. నువ్వే వెళ్ళి ఊరేగు" నరహరి కోపంగా అటు తిరిగిపడుకున్నాడు.

మర్నాడు మధ్యాహ్నం శాంతి తయారై చెప్పులు వేసుకునేసరికి గుండీలు పెట్టుకుంటూ నరహరి ప్రత్యక్షమయ్యాడు.

"మీరెక్కడికి?" అసహనంగా అడిగింది.

"మీ అక్కవాళ్ళింటి దగ్గర్లోనే ఎస్సార్ నగర్‌లో ఓ క్లయింట్ మూడింటికి రమ్మన్నాడు. నిన్ను డ్రాప్ చేసి అటు వెళ్ళి ఆ పని చేసుకు వస్తాను" నరహరి తలుపుకి తాళం వేస్తూ చెప్పాడు.

డ్రైవర్ ముందు ఏమీ అనలేక, కోపాన్ని అణచుకుని కార్లో కూర్చుంది శాంతి. అక్కయ్య ఇంట్లో అక్క అత్తగారు, తోడికోడలు ఉన్నారు. వాళ్ళంతా డ్రాయింగ్ రూంలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వీళ్ళని చూడగానే సంభాషణ ఆపి పలకరించారు. నరహరి అక్కడే ఉన్న రాకింగ్ ఛైర్‌లో కూర్చుని పేపర్ అందుకున్నాడు.

"మీరు ఎస్సార్ నగర్ వెళ్తానన్నారు?" శాంతి అనుమానంగా అడిగింది.

"నాలుగింటికి రమ్మన్నాడు" నరహరి పేపర్లో మొహం దూర్చాడు.

శాంతి అక్కని వంటింట్లోకి లాక్కెళ్ళి అడిగింది.

"వీళ్ళు వస్తారని చెప్పలేదే? ఇంకో రోజు వచ్చేదాన్నిగా?"

"ముందు చెప్పకుండా వచ్చేసారు" ఆమె చెప్పింది.

డ్రాయింగ్ రూంలో పరిస్థితి ఇబ్బందిగా మారింది. అప్పటిదాకా పెద్దగా కబుర్లు చెప్పుకుంటున్న ఆడవాళ్ళు గొంతులు తగ్గించారు.

"రిటైరయ్యాక ఇంకో జాబ్ చూసుకోలేదా హరీ?" అక్క అత్తగారు అడిగింది.

"లేదండి" వినయంగా చెప్పాడు.

"ఇంట్లో ఏం తోస్తుంది? మా వాడైతే చక్కగా ఇంకో ఉద్యోగంలో చేరాడు. తొమ్మిదికి వెళ్ళి ఆరింటికి వస్తాడు" ఆవిడ చెప్పింది.

నరహరి నవ్వాడు తప్ప సమాధానం చెప్పలేదు.

"లోపలికి వెళ్దాం రండి" అక్క ఆడవాళ్ళని తమ బెడ్‌రూంలోకి తీసుకెళ్ళింది.

వాళ్ళు మళ్ళీ కబుర్లలో పడ్డారు. శాంతి మధ్యలో లేచెళ్ళి నరహరికి మీటింగ్ విషయం గుర్తుచేసింది.

"కేన్సిల్ చేసాడు. నెక్స్ట్ వీక్ రమ్మన్నాడు" శాంతికి దుఃఖం వచ్చింది. అతనివంక కోపంగా చూసి లోపలికి వెళ్ళింది.

"మీ వారికి నీమీద అనుమానం అనుకుంటా శాంతీ. అందుకే నీ వెనకే వస్తూంటారు" అక్క తోటికోడలు నవ్వింది.

శాంతికి అవమానంతో కళ్ళనీళ్ళు వచ్చాయి.

"అదేం లేదు. ఇంట్లో ఆయన ఒక్కరికే తోచదు" తెచ్చిపెట్టుకున్న నవ్వుతో చెప్పింది.

మరో అరగంట అసహనంగా కూర్చుని వెళ్ళొస్తానని చెప్పి బయలుదేరింది. బయట నరహరి ఆ కుర్చీలోనే నిద్రపోతున్నాడు.

"పదండి వెళ్దాం." అతన్ని లేపి చెప్పింది.

"అప్పుడేనా? కాఫీ తాగి వెళ్దాం."

"కాఫీ నేనిస్తాను పదండి."

లిఫ్ట్ దాకా వచ్చిన అక్క చెప్పింది. "సారీనే. ఆవిడ అంతే. హాస్యంగా మాట్లాడతాను అనుకుంటుంది."

"పర్లేదు. ఈ మనిషి ప్రవర్తనకూడా అలాగే ఉందిలే" శాంతి నిర్లిప్తంగా చెప్పింది.

ఇంటికి రాగానే అతనిమీద విరుచుకుపడింది.

"క్లయింట్ లేడు, ఎవడూ లేడు. అన్నీ అబద్ధాలు. ఇంత వయసొచ్చి అబద్ధాలు చెప్పడానికి సిగ్గులేదు? మా బావ ఇంట్లో ఉండడని తెలుసు. నేను ఏదో సాధక బాధకాలు మాట్లాడుకుందామని వెళ్తే తయారు. మా అక్క మనింటికి వచ్చినప్పుడు బావ వస్తాడా? రాడుగా? ముందు గదిలో ఆ ముసలమ్మని చూసైనా ఇంటికి వెళ్ళిపోవచ్చుగా? లేదా నాలుగు బజార్లు తిరిగి రావచ్చుగా? ఇల్లూ వాకిలి లేనివాళ్ళలాగా వాళ్ళ కుర్చీలో కూర్చుని నిద్రపోడానికి వచ్చారా?"

"మీ అక్కకి అసలు మేనర్స్ లేదు. మాట్లాడుకుంటుంటే అందర్నీ గదిలోకి తీసుకెళ్ళింది. చందాల వాడిలా ఒక్కడ్నీ కూర్చున్నాను. దాంతో నిద్రొచ్చింది. తప్పా?" నరహరి తిరిగి అరిచాడు.

"ఇంకోసారి నా వెంట తోకలా వచ్చారంటే మాత్రం నేనెక్కడికీ వెళ్ళను."

"నేనే రాను నీతో"

"చాలాసార్లు విన్నాను" విసురుగా వెళ్ళిపోయింది.

"రిటైర్ అవకముందూ ఇదే టార్చర్ కాని, నైన్ టు ఫైవ్ కాస్త విముక్తి దొరికేది జానూ. అప్పటికీ చెప్పాను వేరే జాబ్ చూసుకోండి అని. కానీ కన్సల్టెన్సీ అని పెట్టి ఇంటిని ఆఫీస్ చేసారు. గెస్ట్ బెడ్‌రూంలో కంప్యూటర్, ప్రింటర్ టేబుల్, చైర్స్ అన్నీ అరేంజ్ చేసారు కానీ అందులో ఉండే టైం బహు తక్కువ. ఎప్పుడూ ఇంట్లోనే. పిచ్చెక్కి పోతోందనుకో" ఫోన్‌లో స్నేహితురాలు జానకితో గోడువెళ్ళబోసుకుంది శాంతి.

అవతలనించి జానకి చిన్నగా నిట్టూర్చింది.

"మా బావగారు మావారికంటే ఐదేళ్ళు పెద్ద. రిటైరైన నెలకే హాయిగా వేరే జాబ్‌లో చేరారు. ఆయన ఇంట్లో ఉన్నా ఈ టార్చర్ ఉండదు. తన పనేదో తను చూసుకుంటారు. 'పుణ్యం కొద్దీ పురుషుడు' అంటారు కదా? పూర్వజన్మలో మరీ అంత పాపం చేసేనంటావా?" అనుమానంగా అడిగింది.

"ఊరుకో శాంతీ. నరహరిగారు మంచివారే. కానీ కాస్త చాదస్తం అంతే." జానకి ఊరడించింది.

"కాస్తా?.... సరే ఉంటా. ఆయన వాకింగ్ అయిపోయినట్లుంది బై" శాంతి ఫోన్ పెట్టేసింది.

"టి.వి రావడంలేదే" భర్తకి మంచినీళ్ళ గ్లాస్ అందిస్తూ అడిగింది. నరహరి నవ్వుకుంటూ టి.వి వెనక వైర్‌ని కనెక్ట్ చేసాడు.

"అంటే కావాలని టి.వి రాకుండా చేసారా?" శాంతి నమ్మలేనట్లుగా అడిగింది.

"అవును. నేను లేనప్పుడు సీరియల్స్ అన్నీ చూసేస్తావు. రాత్రికి యూ ట్యూబ్‌లో చూద్దాం. అందుకే ఆపేసా" తాపీగా చెప్పాడు.

"మగాళ్ళు తెలుగు టి.వి సీరియల్స్ చూడటం ఎక్కడా చూడలేదు. ఇదేం శాడిజం?" విసుక్కుంది శాంతి.

"ఎంతమంది మగాళ్ళు తెలుసేంటి నీకు?"

"ఈ వయసులో అదొక్కటే తక్కువ." లోపలకి వెళ్ళిపోయింది.

"టి.వి పెట్టాగా. రా చూద్దాం" ప్రేమగా పిలిచాడు నరహరి.

"ఈరోజు నించి నేను టి.వి చూడటం లేదు ఆ టైంలో పుస్తకాలు చదువుకుంటా. మీరు అవీ దాచిపెడితే కుట్లు, అల్లికలు నేర్చుకుంటా. లేదా తోటపని చేసుకుంటా. నన్నెప్పుడూ టి.వి చూడమనద్దు. దుమ్ము తుడవడానికి కూడా దాన్ని ముట్టుకోను" శపథం చేసింది శాంతి.

"ఇంత చిన్నదానికే అంత కోపమా? అందుకే బిపిలు"

"శాంతి అశాంతి అయినట్లే, బి.పిలుకూడా తమ పుణ్యమే" వెటకారంగా చెప్పింది.

నరహరి ఇంక వాదించలేదు. పెద్ద సౌండ్ పెట్టుకుని టి.వి చూడసాగాడు.

"మా శాంతి బ్రహ్మ రాక్షసిలా తయారైందిరా! ఎంతైనా పెళ్ళాం మగాడికి ఉద్యోగం ఉంటే ఇచ్చే విలువ లేకపోతే ఇవ్వదు. ఇదివరకు ఇలా లేదు. అస్తమానం అరుపులు, కేకలు. నాతో సౌమ్యంగా మాట్లాడి ఎన్నిరోజులైందో. అదేమంటే 'మా బావని చూసి బుద్ధి తెచ్చుకోవచ్చుగా' అంటుంది. ఆయనలాగా నేనెందుకు చేయాలి? నా ఇష్టం నాది. ముప్ఫై ఐదేళ్ళు కష్టపడి పనిచేసాను. ఇప్పుడైనా సుఖపడద్దా? ప్రతి చిన్న విషయానికి ఆర్గ్యుమెంట్స్, అరుపులు. నేనేదో రాచి రంపాన పెడుతున్నట్లు కోపంగా చూస్తుంటుంది. మనశ్శాంతి లేదనుకో" నరహరి తన ప్రాణ స్నేహితుడితో చెప్పి వాపోతున్నాడు.

***

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments